29102024-MAI-12_Layout 1 10/29/2024 3:37 AM Page 1

చిరాగ్‌కు పసిడి

అండర్-23 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్

టిరానలో జరిగిన ఈ టోర్నీ పురుషుల 57 కిలోల విభాగంలో చిరాగ్.. 4-3తో అబ్దిమాలిక్ ఖరచోవ్ (కిర్గిస్థాన్)ను ఓడించి చాంపియన్‌గా అవతరించాడు. భారత్ తరఫున అండర్-23 చాంపియన్‌గా నిలిచిన రెజ్లర్లలో అమన్ సెహ్రావత్ (2022), రీతికా హుడా (2023) తర్వాత చిరాగ్ మూడోవాడు. ఈ టోర్నీలో భారత్ మొత్తంగా 9 పతకాలు సాధించింది. మహిళల ఫ్రీస్టయిల్‌లో అంజలి రజతం సాధించగా పురుషుల ఫ్రీస్టయిల్‌లో అభిషేక్, సుజీత్, విక్కీ కాంస్యాలు నెగ్గారు. మహిళల ఫ్రీస్టయిల్‌లో నేహా, శిక్ష, మోనిక కంచు మోత మోగించగా గ్రీకో రోమన్‌లో విశ్వజీత్ సైతం కాంస్య పతకం గెలిచాడు.

టిరాన(అల్బేనియా): భారత యువ రెజ్లర్ చిరాగ్ చిక్కర అండర్-23 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పసిడితో సత్తాచాటాడు.

గెలుపు దిశగా హైదరాబాద్

అనికేత్‌రెడ్డి (5/40)

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రంజీ ఎలైట్ గ్రూప్-బీ మూడో మ్యాచ్‌లో హైదరాబాద్ గెలుపు దిశగా పయనిస్తోంది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఫాలోఆన్ ఆడుతున్న పుదుచ్చేరి 2 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. ఓపెనర్లు అజయ్ రోహెర (69), శ్రీధర్‌రాజు (61)అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. చేతిలో 8 వికెట్లు ఉన్న పుదుచ్చేరి ఇంకా 212 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 24/2తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన పుదుచ్చేరి 153 పరుగులకు కుప్పకూలింది. అనికేత్‌రెడ్డి (5/40) ధాటికి పుదుచ్చేరి బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. అజయ్ రోహెర (27)మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. మిలింద్, రోహిత్, రక్షణ్ రెడ్డి ఒక్కో వికెట్ తీశారు. ఇదిలా ఉంటే తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 536/8 వద్ద డిక్లేర్ చేసిన విషయం విదితమే.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 28: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో సోమవారం మొదలైన 49వ రాష్ట్ర స్థాయి జూనియర్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పది ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన బాలబాలికలు టోర్నీలో సత్తాచాటుతున్నారు. మొదటి రోజు బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 18-8తో మెదక్ జట్టుపై శుభారంభం చేయగా.. హైదరాబాద్ 12-10తో ఖమ్మంపై, నల్లగొండ 26-10తో కరీంనగర్‌పై, ఆదిలాబాద్ జట్టు 19-6తో వరంగల్‌పై గెలిచాయి. మరోవైపు బాలుర కేటగిరీలో వరంగల్ 28-20తో ఖమ్మంపై, రంగారెడ్డి 16-14తో కరీంనగర్‌పై, ఆదిలాబాద్ 28-24తో నల్లగొండపై, హైదరాబాద్ 50-30తో ఖమ్మంపై, కరీంనగర్ 36-30తో నిజామాబాద్‌పై గెలిచాయి.

కిర్‌స్టెన్‌రాజీనామా

కరాచీ: ఎప్పుడేం జరుగుతుందో తెలియని స్థితిలో ఉన్న పాకిస్థాన్ క్రికెట్‌లో మరో పిడుగు! ఈ ఏడాది ఏప్రిల్‌లో పాక్ పరిమిత ఓవర్ల జట్టుకు హెడ్‌కోచ్‌గా నియమితుడైన దక్షిణాఫ్రికా దిగ్గజం గ్యారీ కిర్‌స్టెన్.. ఆరు నెలలు తిరగకముందే ఆ బాధ్యతల నుంచి వైదొలిగాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సైతం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. గ్యారీ తప్పుకోవడానికి గల కారణాలను పీసీబీ తెలపకపోయినా జట్టు సభ్యులతో పాటు బోర్డుతోనూ విభేదాల వల్లే అతడు రాజీనామా చేసినట్టు పీసీబీ వర్గాల సమాచారం. కిర్‌స్టెన్ స్థానంలో టెస్టు జట్టుకు హెడ్‌కోచ్‌గా ఉన్న జాసన్ గిలెస్పీకి పీసీబీ అదనపు బాధ్యతలను అప్పగించింది. త్వరలో ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్ వరకు అతడు 'మెన్ ఇన్ గ్రీన్'కు హెడ్‌కోచ్‌గా వ్యవహరిస్తాడు.

నెహ్రూ స్టేడియం చెత్తచెత్తగా

న్యూఢిల్లీ: స్టేడియాల్లో ప్రముఖ సింగర్ల లైవ్ కన్సర్ట్‌ల పరంపర వివాదాస్పదం అవుతూనే ఉన్నాయి. ప్రముఖ తెలుగు మ్యూజిక్ డైరెక్టర్ దేవీశ్రీప్రసాద్..గచ్చిబౌలి స్టేడియంలో సంగీతా విభావరి మర్చిపోకముందే ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో దిల్జిత్ దొసాంజీ రెండు రోజుల పాటు నిర్వహించిన 'దిల్ లుమినాటి' కార్యక్రమం రచ్చరచ్చగా మారింది. ఈ లైవ్ కన్సర్ట్‌తో నెహ్రూ స్టేడియం మొత్తం చెత్తతో డంపింగ్ యార్డ్‌గా మారిపోయింది. తాగి పడేసిన బీర్ బాటిళ్లకు తోడు కూల్‌డ్రింక్స్ గ్లాస్‌లు, కవర్లు, ప్లేట్లతో చెత్త పేరుకుపోయింది. దేశంలో స్టేడియాల పరిస్థితి ఇదంటూ పలువురు సోషల్‌మీడియాలో ఫొటోలతో పోస్ట్ చేయడంతో భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. ఈనెల 31 జరిగే క్రీడాటోర్నీ కోసం స్టేడియాన్ని సిద్ధంగా ఉంచుతామని సాయ్ ప్రకటించింది. లైవ్ కన్సర్ట్ నిర్వహణపై అథ్లెట్లు తీవ్రస్థాయిలో సాయ్‌పై విరుచుకుపడుతున్నారు.

ఎస్ఎఫ్ఏ విజేత విజ్ఞాన్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) ఆరో ఎడిషన్ హైదరాబాద్ అంచె పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, కరాటే, స్కేటింగ్, వాలీబాల్ టైటిళ్లు సాధించిన విజ్ఞాన్స్ బో ట్రీ స్కూల్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ రన్నరప్ టైటిల్ దక్కించుకుంది. బాలుర అండర్-9 అథ్లెటిక్స్, స్కేటింగ్‌లో స్వర్ణం, రెండు రజతాలు గెలిచిన ధ్రువకు గోల్డెన్ బాయ్ టైటిల్ లభించగా, బాలికల అండర్-16లో జోహన్న 4స్వర్ణాలు, 2 రజతాలతో గోల్డెన్ గర్ల్‌గా నిలిచింది.

ఉండేదెవరు? వెళ్లేదెవరు?

ఐపీఎల్ ఫ్రాంచైజీలకు రి'టెన్షన్' • మరో రెండ్రోజుల్లో ముగియనున్న గడువు • కేఎల్ రాహుల్‌ను వదిలేయనున్న లక్నో?

ముంబై: వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం త్వరలో జరగాల్సి ఉన్న మెగా వేలానికి ముందే పది ఫ్రాంచైజీలు ప్రకటించాల్సి ఉన్న రిటెన్షన్ జాబితాకు తుది గడువు ముంచుకొస్తోంది. అక్టోబర్ 31 సాయంత్రం 5 గంటల నాటికి ఫ్రాంచైజీలు తాము అట్టిపెట్టుకునే ఆటగాళ్లతో పాటు వదిలేసే క్రికెటర్ల జాబితాను బీసీసీఐకి అందజేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఏ జట్టు ఏ ఆటగాడిని రిటైన్ చేసుకోనుంది? ఎవరిని వదిలించుకోనుంది? ఏ ప్లేయర్ వేలంలోకి వెళ్లనున్నాడు? ఎవరు కోట్లు కొల్లగొట్టే అవకాశముంది? అన్న చర్చోపచర్చలు సాగుతున్నాయి. రిటెన్షన్ నిబంధనల ప్రకారం ప్రతి జట్టు ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకునే అవకాశం ఉండగా ఆయా జట్లు నిలుపుకోబోయే ఆ ఆరుగురు ఎవరు? అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మరికొన్ని గంటల్లో రిటెన్షన్ ప్లేయర్లపై స్పష్టత రానున్నప్పటికీ పలు ఫ్రాంచైజీలు ఇప్పటికే ఆ జాబితాను పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. కీలక ఆటగాళ్లను అట్టిపెట్టుకునే ఫ్రాంచైజీలు పలువురు స్టార్ ప్లేయర్లను వేలానికి వదిలేయడమో లేక రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ఆప్షన్ ద్వారా తిరిగి దక్కించుకోవాలనో చూస్తున్నాయి. వేలానికి వస్తారని అంచనా వేస్తున్న వారిలో రోహిత్ శర్మ (ముంబై ఇండియన్స్), రిషభ్ పంత్ (ఢిల్లీ క్యాపిటల్స్), కేఎల్ రాహుల్ (లక్నో సూపర్ జెయింట్స్) పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గతేడాది హార్దిక్‌ను సారథిగా

నియమించిన ముంబై.. రోహిత్‌ను వదిలేస్తుందని గత కొంతకాలంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై అటు ముంబై గానీ ఇటు రోహిత్ గానీ బహిరంగంగా ఏ ప్రకటనా చేయలేదు. పంత్ వేలంలోకి వస్తే దక్కించుకోవడానికి చెన్నై సూపర్ కింగ్స్ రెడీగా ఉన్నట్టు సీఎస్కే వర్గాల సమాచారం.

ధోనీ ఐపీఎల్ కెరీర్ చరమాంకంలో ఉండటంతో ఆ జట్టు పంత్‌ను దక్కించుకుని వికెట్ కీపర్‌తో పాటు సారథ్య పగ్గాలు అప్పజెప్పుతుందని చర్చ జరుగుతోంది.

ఆరెంజ్ ఆర్మీ నుంచి ఎవరు?

గత సీజన్ ఫైనలిస్టులు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆ జట్టు పవర్ హిట్టర్ హెన్రిచ్ క్లాసెన్, సారథి పాట్ కమిన్స్, అభిషేక్ శర్మను రిటైన్ చేసుకోనున్నట్టు వినికిడి. ట్రావిస్ హెడ్, నితీశ్ రెడ్డి కూడా జాబితాలో ఉన్నట్టు తెలుస్తోంది.

రాహుల్‌కు లక్నో కటిఫ్?

2022 సీజన్‌లో కేఎల్ రాహుల్‌కు భారీ ధర చెల్లించి సొంతం చేసుకోవడమే గాక సారథ్య పగ్గాలు అప్పగించిన లక్నో యాజమాన్యం.. అతడిని వదిలించుకునేందుకే సిద్ధమైనట్టు వార్తలు వస్తున్నాయి. విండీస్ ఆటగాడు నికోలస్ పూరన్‌ను టాప్ రిటెన్షన్ (రూ.18 కోట్లు)గా యువ ఆటగాళ్లు రవి బిష్ణోయ్, అయూష్ బదోని, మోహ్సిన్ ఖాన్, మయాంక్ యాదవ్‌ను మిగిలిన ఆప్షన్స్‌గా చేసినట్టు తెలుస్తోంది. గత మూడు సీజన్లలో రెండుసార్లు లక్నోను ప్లేఆఫ్స్ చేర్చినా 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ సందర్భంగా లక్నో యజమాని సంజీవ్ గోయెంకా అందరూ చూస్తుండగానే రాహుల్‌పై దురుసుగా మాట్లాడటం వివాదాస్పదమైంది. అప్పుడే లక్నోను వదిలేసేందుకు రాహుల్ సిద్ధమైనట్టూ గుసగుసలు వినిపించాయి. ఒకవేళ అతడు వేలంలోకి వస్తే సొంతం చేసుకోవడానికి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

గెలిచినోళ్లదే సిరీస్!

నేడు భారత్, న్యూజిలాండ్ అమ్మాయిల మూడో వన్డే

అహ్మదాబాద్: స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడుతున్న భారత మహిళల జట్టు మంగళవారం మరో కీలక పోరుకు సిద్ధమైంది. తొలి వన్డేలో టీమ్ ఇండియా నెగ్గగా రెండో వన్డేను కివీస్ సొంతం చేసుకోవడంతో మంగళవారం జరుగబోయే మూడో వన్డేలో గెలిచిన జట్టు సిరీస్‌ను కైవసం చేసుకోనుంది. గత రెండు మ్యాచ్‌లలో బౌలర్లు రాణించినా భారత బ్యాటింగ్ లైనప్ మాత్రం ఆశించిన స్థాయిలో ఆడలేదు. రెండో వన్డేలో టాపార్డర్ విఫలమైంది. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన గత

రెండు మ్యాచ్‌లలో చేసినవి 5 పరుగులే. తొలి వన్డేలో ఫర్వాలేదనిపించినా గత మ్యాచ్‌లో షఫాలీ, జెమీమా చేతులెత్తేశారు. రెండో వన్డేలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టును గెలిపించే ఇన్నింగ్స్ ఆడలేకపోయింది. బ్యాటింగ్ సమస్యలు వెంటాడుతున్న తరుణంలో నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో భారత్ ఏ మేరకు రాణిస్తుందనేది ఆసక్తికరం. రాధా యాదవ్ ఆల్‌రౌండ్ షో తో మెరుస్తుంటడం భారతానికు కలిసొచ్చేదే. మరోవైపు ఇటీవలే ప్రపంచ చాంపియన్లుగా నిలిచిన కివీస్.. మూడో వన్డే లోనూ గెలిచి వన్డే సిరీస్ ట్రోఫీని ఒడిసిపట్టుకోవాలని భావిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 1:30 నుంచి ఆరంభమయ్యే మ్యాచ్ స్పోర్ట్స్-18లో ప్రత్యక్ష ప్రసారమవుతుంది.

టైటాన్స్ ధమాకా

పట్నా పైరేట్స్‌పై విజయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ గెలుపు బాట పట్టింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 28-26తో మూడు సార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. ప్రథమార్ధంలో వెనుకంజ వేసిన టైటాన్స్..కీలకమైన ద్వితీయార్ధంలో జూలు విదిల్చింది. టైటాన్స్ తరపున ఆశీష్ నర్వాల్(9 పాయింట్లు), పవన్ సెహ్రావత్(5 పాయింట్లు), డిఫెండర్ అంకిత్(4 పాయింట్లు) రాణించారు. పట్నా జట్టులో దేవాంక్(7 పాయింట్లు), అయాన్(6 పాయింట్లు) ఆకట్టుకున్నారు. ఇరు జట్ల మధ్య ప్రథమార్ధం హోరాహోరీగా సాగింది. పవన్ ఒకింత తడబడ్డా..ద్వితీయార్ధంలో ఆశీష్ కూడా జతకలువడంతో టైటాన్స్‌కు తిరుగులేకుండా పోయింది. పుంజుకునేందుకు పైరేట్స్ ప్రయత్నించినా..వరుస పాయింట్లతో టైటాన్స్ విజయం వైపు నిలిచింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.